క్లుప్తంగా

ముగిసిన తిరునక్షత్రం పూజలు



దివ్యప్రబంధ పారాయణాన్ని చేస్తున్న స్థానాచార్యులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గడిచిన ఐదు రోజులుగా జరిగిన మనవాళ మహామునులు తిరునక్షత్రం పూజలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఆలయ ఆస్థానమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవి, ఆళ్వారులను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, షోడశోపచారపూజలు నిర్వహించారు. దివ్యప్రబంధ పారాయణాలు పఠించారు. విశేషంగా హారతులు అందజేశారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పవర్ లిఫ్టింగ్‌లో లవకుమార్ ప్రతిభ



లవకుమార్‌ను అభినందిస్తున్న విస్తం ప్రిన్సిపాల్ శివకుమార్ తదితరులు

పెందుర్తి: ఆంధ్రా యూనివర్సిటీలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఇంటర్ కాలేజియేట్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పవర్ లిఫ్టింగ్‌లో పెందుర్తి మండలం పినగాడిలోని విస్తం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి జె.లవకుమార్ బంగారు పతకం సాధించాడు. 74 కిలోల విభాగంలో జరిగిన పోటీలో విజేతగా నిలిచి ఆల్ ఇండియా పవర్ లిఫ్టింగ్ ఈవెంట్‌కు అర్హత సాధించాడు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విజేత లవకుమార్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శివకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనంద్, ఫిజికల్ డైరెక్టర్ బి.రమణారావు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

రెవెన్యూ సదస్సుకు 32 వినతులు



గ్రామసభలో పాల్గొన్న అధికారులు ప్రజాప్రతినిధులు

పెందుర్తి: మండలంలోని రాంపురం గ్రామ సచివాలయంలో బుధవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలోని రైతుల నుంచి వివిధ భూ సమస్యలపై 32 వినతులు అందాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులను పూర్తిస్థాయిలో విచారించి వీలైనంత వేగంగా పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, ఎంపీటీసీ సభ్యురాలు హిమబిందు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రామారావు

పరవాడ: పెదముషిడివాడ గ్రామంలో ప్రభుత్వ భూములను పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని గొర్లివానిపాలెం గ్రామానికి చెందిన సీహెచ్ రామారావు కోరారు. ఈ మేరకు గ్రామంలో బుధవారం రీ సర్వే భూసమస్యలపై ఏర్పాటు చేసిన గ్రామ రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలో గెడ్డ వాగులు, ప్రభుత్వ భూములు, పంట కాలువలు, ప్రభుత్వ రహదారులు, బందలు, రుద్రభూములు, చెరువులను కాపాడాలని ఆ వినతిపత్రంలో కోరారు. వినతి పత్రం అందించిన వారిలో బి.శంకరరావు, పి.నానాజీ ఉన్నారు.

ఉద్యాన వన పంటల్లో బంతి సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. కేవలం 3–4 నెలల పంట.. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. పరవాడ మండలంలో ఈ ఏడాది పలువురు రైతులు బంతి సాగుపై ఆసక్తి కనబరిచారు. పండగలు, కార్తీకం, మార్గశిరం, వివాహాది శుభకార్యాల సీజన్లలో బంతిపూలకు మంచి డిమాండ్ ఉండడంతో ఉద్యాన అధికారులు సైతం బంతి సాగుపై రైతులను ప్రోత్సహిస్తున్నారు.

సిరుల పూబంతి





పందివానిపాలెంలో బంతి పూల సాగు, (ఇన్‌సెట్) తెగులు సోకిన బంతిపూవు

- బంతి పూల సాగుపై రైతుల ఆసక్తి
- ప్రోత్సహిస్తున్న ఉద్యానవన శాఖ
- 3–4 నెలల్లోనే రూ.లక్షల్లో ఆదాయం



బంతిపూల సాగుపై రైతులకు సూచనలిస్తున్న హార్టికల్చర్ అధికారి లావణ్య

పరవాడ: కొన్నేళ్లుగా వరి, చెరకు తదితర సంప్రదాయ పంటల సాగు రైతులకు స్థిరమైన ఆర్థిక భరోసానివ్వట్లేదు. దీంతో రైతులు నష్టపోకుండా తక్కువ పెట్టుబడితో అధికాదాయం పొందే ఉద్యాన పంటలపై దృష్టిసారిస్తున్నారు. ఇందుకు వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో మార్కెట్లో మంచి గిరాకీ ఉన్న బంతిపూల సాగు వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. ఎకరానికి రూ.40–50 వేల పెట్టుబడితో 3–4 నెలల్లోనే పెట్టుబడిపోగా రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్నారు.

బంతి సాగుపై రైతుల ఆసక్తి

మండలంలోని వాడచీపురుపల్లి శివారు పందివానిపాలెం, నాయుడుపాలెం శివారు మెట్టపాలెం గ్రామాల్లో ఈ ఏడాది రైతులు బంతి సాగు బాట పట్టారు. అన్ని సీజన్లలో బంతిపూలకు డిమాండ్ ఉండటంతో నష్ట భయం లేదని రైతులు చెప్తున్నారు. నీటి సదుపాయం ఉన్న చోట రైతులు బంతి సాగుకు మారేలా ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం ఉంటే మరింత తక్కువ ఖర్చుతో, అధిక లాభాలను ఆర్జించ వచ్చని, ఆ దిశగా రాయితీపై డ్రిప్ పరికరాల ఏర్పాటుకు రైతుల్ని ప్రోత్సహిస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే బంతి పూల సాగే మేలని స్థానిక రైతులు చెప్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో సాగు చేస్తున్న బంతిపూలను గాజువాక, విశాఖ మార్కెట్లకు తరలిస్తున్నారు. కిలో రూ.80 నుంచి రూ.100కు అమ్ముతున్నారు.

వేసవిలో మినహా..

బంతి మొక్కల ఎదుగుదల సీజన్లపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా అన్ని కాలాల్లో దిగుబడి నిస్తుంది. వర్షాకాలంలో మొక్క త్వరగా ఎదిగి, పూత దశకు చేరుతుంది. శీతాకాలంలో గిడసబారినట్లు కనిపించినా త్వరితగతిన పూతకు వస్తుంది. వేసవిలో మాత్రం మొక్క త్వరగా పెరిగినా, దిగుబడిలో ఆశించిన నాణ్యత ఉండదు. కాలానుగుణంగా బంతి సాగులో తెగుళ్ల నివారణ, సస్య రక్షణ చర్యలు చేపడితే మేలైన దిగుబడి సాధ్యం.

సస్య రక్షణ చర్యలు

- బంతి సాగులో మొక్క దశలో కత్తిరింపులు, సూక్ష్మ పోషకాల వినియోగం, సస్యరక్షణ చర్యలు అధిక దిగుబడులకు కీలకం.
- నీటి యాజమాన్య పద్ధతులు పాటించి కలుపు బెడద లేకుండా చూసుకోవాలి.
- సాగు ప్రణాళిక ఆధారంగా ఏ రోజు పూలు కోతకు వస్తాయో అంచనా వేసి, దానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు నారు పోసుకోవాలి.
- బంతి నారు 20-25 రోజుల్లో పెరుగుతుంది. నాటిన 45-50 రోజులకు మొక్కలు మొదటి పూతకు వస్తాయి. అప్పటి నుంచి 30-35 రోజులకు చివరి పూత ఉంటుంది.

పూల కోత పద్ధతులు

- బంతిపూలు బాగా విచ్చుకున్న తర్వాతే కోయాలి. పూల కోతకు ముందు రోజు తడి ఇస్తే ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి.
- కోసిన పూలను గోనె సంచి/వెదురు బుట్ట/తడిసిన వస్త్రంలో వేసి మార్కెట్‌కు తరలించాలి.
- పంట కాలంలో 4-5 సార్లు పూల కోత ఉంటుంది. సకాలంలో పూలను కోస్తే ఎకరాకు 7-8 టన్నుల దిగుబడి వస్తుంది.
- తొడిమను ఒకటి/ఒకటిన్నర అంగుళాల పొడవుండేలా కోస్తే పూల నాణ్యత పాడవదు.

లాభసాటిగా పూల సాగు



బంతి పూల సాగు లాభసాటిగా ఉందని తెలిసి నాకున్న 40 సెంట్లలో మొక్కలు నాటాను. ప్రస్తుతం పంట చేతికొచ్చింది. కోతకు వచ్చిన పూలను గాజువాక మార్కెట్లో విక్రయిస్తున్నాం. హోల్‌సేల్ వ్యాపారులు కిలో రూ.70–80 మధ్య కొనుగోలు చేస్తున్నారు. కార్తీకమాసం నుంచి బంతి పూలకు మరింత డిమాండ్ పెరుగుతుంది. దీంతో రాబడి కూడా పెరిగే అవకాశాలున్నాయి.

– వెన్నల అప్పారావు, మెట్టపాలెం

తెగుళ్లపై అవగాహన కల్పించాలి



నాకున్న 80 సెంట్ల పొలంలో ఈ ఏడాది బంతిపూల సాగు మొదలెట్టా. ఇటీవల కురిసిన వర్షాల వల్ల కొంత నష్టం జరిగింది. అయినప్పటికీ పెట్టుబడులు పోగా లాభమే వచ్చింది. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే బంతి పూల సాగు బాగుంటుంది. బంతి సాగులో చిన్న చిన్న తెగుళ్లు సోకుతున్నాయి. వాటి నివారణకు అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలి.

– బురద రాజు, పందివానిపాలెం

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



బంతిపూల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. బంతిపూల పంటకు సోకే మీలీబగ్, త్రిప్స్ టాబాసి తెగుళ్లపై రైతాంగం అప్రమత్తంగా ఉండాలి. మీలీబగ్స్ కనిపిస్తే ప్రొఫెనోపాస్/ డైమితోయేట్ 2 మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. త్రిప్స్ టాబాసి తెగులు నివారణకు ఫిప్రోనిల్ 1.5 మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే సరిపోతుంది.

– లావణ్య, ఉద్యానశాఖ అధికారి , పరవాడ

వెంకన్న పవిత్రోత్సవాలకు వేళాయె

- నేడు వేంకటాద్రిపై ఉత్సవాలకు అంకురార్పణ



ముస్తాబైన వేంకటాద్రి



పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలకు సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేయనున్నారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో యాత్రికుల వలన గానీ, అర్చకుల వలన గానీ, సిబ్బంది వలన గానీ తెలిసో తెలియకో జరిగే కొన్ని దోషాలకు నివారణగా ఏటా పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో గురువారం ప్రారంభం కానున్న ఉత్సవాల్లో రోజువారీగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, అగ్ని ప్రతిష్ఠ, శాత్తుముర్తై, స్వామివారికి కల్యాణోత్సవం, పవిత్ర సమర్పణ, ఊంజల్ సేవలు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యులు తెలిపారు. ఉత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పెందుర్తి ప్రాంతంలో పోలీసులకు పట్టుబడిన 16 మందికి కోర్టు రూ.1.60 లక్షల జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింహరాజు తెలిపారు. బుధవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా, జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌లో విద్యార్థులకు పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఆస్పత్రి ప్రతినిధులు

సింహాచలం: ప్రపంచ దృష్టి దినోత్సవాలు, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో బుధవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కంటి వైద్యం, కంటి ఆరోగ్యం అనే అంశంపై 22 పాఠశాలల నుంచి 113 మంది విద్యార్థులు పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. శంకర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, డీజీఎం వి.రమేష్‌కుమార్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు ఈ నెల 13న నిర్వహించే వేడుకల్లో బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఈ నెల 13 వరకు చిత్రలేఖనం, కంటి అద్దాలపై పెయింటింగ్, దేశభక్తి గీతాలు, వక్తృత్వం, రోల్‌ప్లే, స్టోరీ టెల్లింగ్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 9121005933 ఫోన్ నంబర్లో సంప్రదించాల్సిందిగా డీజీఎం కె.బంగార్రాజు తెలిపారు.

పండగ దండోరాలో వివాదం.. పరస్పర ఫిర్యాదులపై కేసు

పరవాడ: వెన్నలపాలెంలో మరిడిమాంబ పండగ దండోరాను అడ్డుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేత, గ్రామ సర్పంచ్ వెన్నల అప్పారావు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావుకు బుధవారం ఫిర్యాదు చేశారు. సర్పంచ్ తెలిపిన వివరాలు. గ్రామంలో ఈ నెల 14న జరగనున్న మరిడిమాంబ పండగకు చాటింపు వేస్తున్న కొల్లి వాసును గ్రామానికి చెందిన పైల వెంకటరమణమూర్తి అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ గ్రామ పెద్దలతో కలిసి రామాలయం వద్దకు వెళ్లి మళ్లీ దండోరా వేయిస్తున్న సమయంలో అక్కడే ఉన్న వెంకటరమణమూర్తి మళ్లీ అడ్డు తగిలారు. వారించే క్రమంలో తోపులాట జరిగింది. ఆయనపై తామెలాంటి దాడికి పాల్పడలేదని సర్పంచ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే తనను దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి పాల్పడిన వెంకటరమణమూర్తిపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో సర్పంచ్ కోరారు. గ్రామ పెద్దలకు తెలపకుండా చాటింపు తగదని చెప్పిన తనపై సర్పంచ్ వెన్నల అప్పారావు, వెన్నల సింహాద్రి, వెన్నల అయ్యబాబులు దౌర్జన్యం చేసి గాయపర్చారని పైల వెంకటరణమూర్తి మంగళవారం రాత్రి పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదులు స్వీకరించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఉచిత పశు గర్భకోశ వైద్య శిబిరం



పశు గర్భకోశ చికిత్స శిబిరాన్ని ప్రారంభిస్తున్న పశు సంవర్థక అధికారులు, ప్రజా ప్రతినిధులు

సబ్బవరం: మండలంలోని అమృతపురం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం, పాడి రైతుల అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బైలపూడి గౌరి, ఎంపీటీసీ సింగంపల్లి శ్రీనివాసరావు చేతులమీదుగా ప్రారంభమైన ఈ శిబిరంలో 62 పశువులకు గర్భకోశ చికిత్సలు, 32 పెయ్యలకు నట్టల నివారణ మందులందించారు. రెండు ఆవులకు మందగుడి చికిత్స అందించినట్లు సబ్బవరం ప్రాంతీయ పశు వైద్యశాల ఏడీ డాక్టర్ కె.ఉషాకుమారి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్థక అధికారి డాక్టర్ బి.రామ్మోహనరావు, జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణాధికారి డాక్టర్ బి.ప్రసాదరావు, జిల్లా శస్త్ర చికిత్సకులు డాక్టర్ భానుబాబు, డీఏ ల్‌డీఏ డాక్టర్ సౌజన్య, డాక్టర్లు జి.అరుణ, ఎస్.స్వర్ణలత, బి.సంధ్య, గ్రామ పెద్దలు బైలపైడి రామారావు, మాజీ సర్పంచ్ గండి ముత్యాల నాయుడు, తవ్వవానిపాలెం సర్పంచ్ బోకం స్వామినాయుడు, బోకం కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం



వెదుళ్లనరవ శివాలయం వద్ద రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

సబ్బవరం: మండలంలోని ప్రతి ప్రాంతాన్ని దశల వారీగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని పలు గ్రామాల్లో రూ.2.94 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దిశగా అడుగులు వేస్తోందన్నారు. జీవీఎంసీ నిధులతో చేపట్టే ఈ పనుల్ని త్వరితగతిన పూర్తి చేసి, అందుబాటులోకి తెస్తామన్నారు. నంగినారపాడులోని అజనగిరికాలనీలో రూ.19 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైన్లు, శెట్టివానిపాలెంలో రూ.19.98 లక్షలతో వరద నీటి కాలువ, వెదుళ్లనరవ శివాలయం రోడ్డులో రూ.39.89 లక్షలతో బీటీ రోడ్డు, కొత్తూరులో రూ.19.98 లక్షలతో సీసీ డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణం తదితర పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, వార్డు సీనియర్ నాయకులు ఇందల రమణ, వార్డు అధ్యక్షుడు ఒబ్బిన శ్రీకాంతి, కూటమి సీనియర్ నాయకులు గంతకోరు శివ, గవర సత్తిబాబు, ఎల్లపు శ్రీనివాసరావు, రాజాన పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్ అప్పలనాయుడు

పరవాడ: అతివేగం, డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలకు గురై కుటుంబాలను వేదన గురిచేయొద్దంటూ స్వయం సహాయక సంఘాల సభ్యులు వాహనదారులకు అవగాహన కల్పించారు. డీఆర్‌డీఏ–సెర్ప్ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై పరవాడ గ్రామంలో స్వయం సహాయక సంఘ సభ్యులు బుధవారం ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో బ్యానర్ పట్టుకుని సిగ్నళ్ల వద్ద ఆగిన వాహనదారులకు ట్రాఫిక్ నియమాలను పాటించాలని కోరారు. ర్యాలీలో భాగంగా ప్రజలకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వల్ల ప్రమాదాలకు గురైనప్పటికీ ప్రాణాపాయం నుంచి చాలా వరకు తప్పించుకోవచ్చని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై నినాదాలు చేశారు. సంతబయలులో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి పట్నాయక్, ఏపీఎం బి.రంగారావు, సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో షిర్డీ ఆలయ సీఈవో



భాగ్యశ్రీ బనయత్‌కి ప్రసాదాన్ని అందజేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం షిర్డీ ఆలయ సీఈవో భాగ్యశ్రీ బనయత్(ఐఏఎస్) దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ అందజేశారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



రైతులకు ఎరువులు అందిస్తున్న రాంకీ ఫౌండేషన్ రీ సస్టైనబిలిటీ హెచ్ఆర్ బాలాజీ

పరవాడ: వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా అధిక దిగుబడులు సాధించడమే కాకుండా మెరుగైన ఆదాయాన్ని పొందేందుకు అవకాశం ఉందని రాంకీ ఫౌండేషన్ రీ సస్టైనబిలిటీ హెచ్ఆర్ బాలాజీ తెలిపారు. నాయుడుపాలెంలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న 97 మంది రైతులకు రాంకీ ఫౌండేషన్ అందించిన రూ.2 లక్షల విలువైన సేంద్రియ ఎరువులను బుధవారం ఆయన అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశ్రామికీకరణ నేపథ్యంలో రోజు రోజుకీ పర్యావరణంలో పెనుమార్పులు సంభవిస్తున్నాయని, ఫలితంగా మనం తినే ఆహార పదార్థాలు కూడా కలుషితమై ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. ఈ తరుణంలో రాంకీ ఫౌండేషన్ సరఫరా చేస్తున్న ఫసల్ అమృత్ ఎరువుల ద్వారా తక్కువ నీరు, ఎరువుల వినియోగంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య మాట్లాడుతూ రైతులకు రాంకీ ఫౌండేషన్ చేస్తున్న సాయానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్, మహిళా కోఆర్డినేటర్ రాజేశ్వరి, నాయుడుపాలెం మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామమూర్తి, ఉప సర్పంచ్ ఆర్.ముత్యాలు, మహాలక్ష్మి, రమాదేవి, గంగరాజు, సన్ని, స్థానిక రైతులు పాల్గొన్నారు.

అర్చకుడి తీరుపై ఈవోకు వీహెచ్‌పీ ఫిర్యాదు



ఈవో త్రినాథరావుకు ఫిర్యాదు చేస్తున్న విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు

సింహాచలం: సింహగిరి పైనున్న కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ పూర్వ అర్చకుడిపై చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) నాయకులు దేవస్థానం ఈవో వి.త్రినాథరావుకు బుధవారం ఫిర్యాదు చేశారు. కొండదిగువ పైడితల్లి అమ్మవారి ఆలయానికి ఇటీవల బదిలీపై వెళ్లిన ఆ అర్చకుడు బినామీలను ఆలయంలో పూజలకు పెట్టి సింహగిరిపై పెళ్లిళ్ల వ్యాపారం చేస్తున్నాడని, కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ వంటశాలని కూడా తన ఆధీనంలో ఉంచుకున్నాడని, వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింహగిరిపై వివాహం చేసుకునే వారికి మండపాల డెకరేషన్, షామియానాలు, కుర్చీలు అద్దెకు ఇచ్చే పాటని పాడుకున్న కాంట్రాక్టర్ అధిక ధరలు వసూలు చేస్తున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. వివాహ సామగ్రి, పురోహితుడిని సమకూర్చడంతో పాటు దేవస్థానానికి చెందిన గదులను కూడా తన ఆధీనంలో పెట్టుకుని పెళ్లిబృందాల నుంచి అధిక మొత్తం వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. వెంటనే వేలం పాటలు నిలుపుదల చేసి, వివాహం చేసుకునే వారికి మేలు చేయాలని కోరారు. సింహగిరిపై పెళ్లిళ్ల సమయంలో కొందరు మద్యం సేవిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో సింహగిరిపై రాత్రి వేళల్లో పెళ్లిళ్లకు అనుమతించేవారు కాదని, ఆ పద్ధతినే పునరుద్ధరించాలని కోరారు. పుష్కరిణి సత్రంలో ఉన్న మండపంలో వివాహాలు జరిగేవని, దాన్ని వినియోగంలోకి తీసుకురావాలని విన్నవించారు. దేవస్థానానికి చెందిన వేద పాఠశాలలో కొందరు విద్యార్థులు ఇటీవల చేసిన షార్ట్ ఫిల్మ్ విషయంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈవోను కలిసిన వారిలో వీహెచ్‌పీ నాయకులు పూడిపెద్ది శర్మ, మీసాల రవీంద్ర, అజయ్ యాదవ్, బీజేపీ నాయకులు మాధవీలత, నాగభూషణం, రామకృష్ణ తదితరులు ఉన్నారు. అంతకు ముందు తొలిపావంచా వద్ద విలేకర్ల సమావేశంలో ఈ విషయాలను మీడియాకు తెలిపారు.

శివాలయం నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న కొటాన సత్యం

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని ఉమా రామలింగేశ్వరస్వామివారి ఆలయ పునర్నిర్మాణానికి ఆదిరెడ్డిపాలేనికి చెందిన ఉమా వాటర్ ప్లాంట్ నిర్వాహకులు కొటాన సత్యం రూ.1,00,116 విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని నిర్మాణంలో ఉన్న ఆలయం వద్ద కమిటీ సభ్యులకు బుధవారం అందించారు. విరాళం అందించిన సత్యంకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు బర్ల రమణ, గెడ్డం కృష్ణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, కొల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యలకు పరిష్కారం



మొగలిపురం సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం: గ్రామాల్లో భూ సంబంధిత సమస్యల సత్వర పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని మొగలిపురంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. గ్రామంలో రైతులు సమస్యలపై 58 అర్జీలను తహసీల్దార్‌కు అందించారు. రైతులంతా రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొగలిపురం రెవెన్యూ పరిధిలో 256 సర్వే నెంబర్లకు గాను 1115.86 ఎకరాల భూమి ఉందన్నారు. వీటిలో 861.51 ఎకరాల జిరాయితీ, 254.35 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. సదస్సులో సర్పంచ్ గండి అరుణ, ఎంపీటీసీ తమరాణ బంగారినాయుడు, రీ సర్వే డీటీ గణేష్, మండల సర్వేయర్ లాలం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.